సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



ముస్తాబైన ఆలయాలు

నేడు మాఘ అమావాస్య సందర్భంగా జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. పలుచోట్ల జాతరలు నిర్వహించనున్నారు.

- 10లో ▸



ఈసీ నామినీగా సిద్ధిఖీ

తెలంగాణ యూనివర్సిటీ ఈసీ నామినీగా ప్రొఫెసర్ సిద్ధిఖీని నియమిస్తూ పాలక మండలి నిర్ణయించింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.8 /18.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. రాత్రి చలితీవ్రత తగ్గవచ్చు.

న్యూస్‌రీల్

ఓటరు తుది జాబితా విడుదల

- జిల్లాలో మొత్తం ఓటర్లు 6,77,936

కామారెడ్డి క్రైం: సెకండ్ సమ్మరి రివిజన్‌లో భాగంగా 2024 జనవరి1 నాటికి అర్హత కలిగిన ఓటర్లతో కలిసి రూపొందించిన ఓటరు తుది జాబితాను కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం విడుదల చేశారు. తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 6,77,936 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. వారితో పాటు 27 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు, మరో 558 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా మొత్తం మీద 3,27,724 మంది పురుష ఓటర్లు, 3,50,181 మంది మహిళా ఓటర్లు ఉండగా, మరో 31 మంది ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఉన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో 2,01,935, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 2,21,730, కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో 2,54,271 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. తుది ఓటరు జాబితాను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ స్థాయి అధికారులకు అందజేయడంతో పాటు తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో నోటీసు బోర్డుపై ప్రదర్శించామని తెలిపారు.

ఆలయాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



కామారెడ్డి టౌన్: మాఘ అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని ప్రముఖ ఆలయాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా తెలిపారు. తాడ్వాయి మండలం సంతాయిపేటలోని భీమేశ్వరాలయం, మద్దికుంట బుగ్గ రామేశ్వర ఆలయాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లాలో ఎస్సైల బదిలీ

కామారెడ్డి క్రైం: జిల్లాలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి వీఆర్‌లో ఉన్న సీహెచ్ గణేశ్‌ను దోమకొండ పోలీస్ స్టేషన్‌కు, మరో ఎస్సై ప్రభాకర్‌ను బీబీపేటకు బదిలీ చేశారు. పిట్లం ఎస్సై కొండా విజయ్‌ని రామారెడ్డికి, కామారెడ్డి పట్టణ ఎస్సై లింగారెడ్డిని కరీంనగర్ వీఆర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. బదిలీలతో ఖాళీగా ఉన్న చోట్లకు కొత్త ఎస్సైలు రావాల్సి ఉంది.

పది కేంద్రాల్లో 'నవోదయ' ప్రవేశ పరీక్ష

కామారెడ్డి టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం శనివారం పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో తొమ్మిది, నిజాంసాగర్‌లో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

సెమీస్‌కు చేరిన నిఖత్

నిజామాబాద్‌నాగారం: బల్గేరియా దేశంలో జరుగుతున్న అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ సెమీస్‌కు చేరింది. గురువారం ఫ్రాన్సు దేశానికి చెందిన క్రీడాకారిణితో జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో 5–0 తేడాతో గెలిచి సెమీస్‌లో అడుగు పెట్టింది. ఈ నెల 10న బల్గేరియా క్రీడాకారిణితో నిఖత్ సెమీస్‌లో తలపడనుంది.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఇలియాజ్



కామారెడ్డి టౌన్: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ ఇలియాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు శివసేనారెడ్డి, సర్బిద్వివేదిలు గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మహమ్మద్ ఇలియాజ్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తనయుడు.

దళిత మహిళపై దాడి

సాక్షి, కామారెడ్డి : రామారెడ్డిలో నివాసం ఉంటున్న వేరే గ్రామానికి చెందిన ఓ దళిత మహిళపై కొందరు దాడికి పాల్పడి అమానుషంగా వ్యవహరించారని బాధితురాలు గురువారం రామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం రాత్రి జరిగిన ఘటనలో ఆమెను దుస్తులు ఊడదీసి మరీ చితకబాదారని తెలుస్తోంది. ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదుతో రామారెడ్డి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లీజు మిల్లుల దొంగాట!

- సీఎంఆర్ ఇవ్వకుండా కాలయాపన
- బ్లాక్ లిస్టులో పెడతామన్న అధికారులు
- జిల్లాలో ప్రభుత్వానికి చేరాల్సిన బియ్యం 28,279 మెట్రిక్ టన్నులు
- జుక్కల్ సెగ్మెంట్‌లోనే ఎక్కువ..



సాక్షి, కామారెడ్డి: కస్టం మిల్లింగ్ రైస్ విషయంలో కొందరు మిల్లర్లు దొంగాట ఆడుతున్నారు. ముఖ్యంగా మిల్లులను లీజుకు తీసుకుని నడుపుతున్న వారు తీసుకున్న వడ్లను మరాడించి ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా రోజులు గడుపుతున్నారు. బియ్యం ఇవ్వని మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతామని అధికారులు వార్నింగ్ ఇచ్చినా భయపడడం లేదు. 2022–23 ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 4,73,242 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించిన ప్రభుత్వం జిల్లాలోని 163 మిల్లులకు సరఫరా చేసింది. వడ్లను మరాడించి 3,18,914 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది. గత నెలాఖరునాటికి పూర్తిస్థాయిలో బియ్యాన్ని ఇవ్వాలని ఆదేశించారు. అయితే 2,90,635 మెట్రిక్ టన్నుల బియ్యం తిరిగి ఇచ్చారు. ఇంకా 28,279 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. 91 శాతం రికవరీ కాగా ఇంకా తొమ్మిది శాతం బియ్యం రావాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా సీఎంఆర్ ఇవ్వడానికి ప్రభుత్వం మిల్లర్లకు తాజాగా ఈ నెలాఖరు వరకు అవకాశం ఇచ్చింది. గత నెలలో జిల్లా అధికారులు మిల్లర్లపై ఎంత ఒత్తిడి తీసుకువచ్చినా ఫలితం లేకుండాపోయింది. నూటికి నూరు శాతం సీఎంఆర్ సేకరించాలని అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినా పట్టించుకోలేదు. ఫలితంగా జిల్లాలో తొమ్మిది శాతం బియ్యం ఇంకా మిల్లర్ల వద్దే ఉండిపోయింది. ఈ నెలాఖరు వరకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో బకాయిపడిన మిల్లర్ల నుంచి బియ్యం సేకరించడంపై అధికారులు ఫోకస్ చేస్తున్నారు. ఎలాగైనా సీఎంఆర్‌ను నూరు శాతం రాబట్టాలని ప్రయత్నిస్తున్నారు.

ఆ మిల్లుల్లో ధాన్యం నిల్వలున్నాయా..?

సీఎంఆర్ ఇవ్వకుండా తాత్సారం చేయడంలో మతలబు ఉందని.. అందువల్లే ప్రభుత్వానికి అప్పగించడంలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా మిల్లులకు ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యం గోదాముల్లో నిల్వ ఉన్నాయా ? లేదా అమ్ముకుని సొమ్ము చేసుకున్నారా ? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. నిర్దేశించిన సమయంలో మరాడించి బియ్యాన్ని ఎఫ్‌సీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా సరఫరా చేయాల్సిన బాధ్యత మిల్లులపైనే ఉంటుంది. దీన్ని పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. జిల్లాలో అధికారులు ఎంత మొత్తుకుంటున్నా బియ్యం ఇవ్వడం లేదంటే అసలు ఆ మిల్లుల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయా అనేది సందేహాస్పదంగా మారింది. ధాన్యం ఎక్కువ కాలం నిల్వ చేయడం వల్ల కూడా సమస్యలు తలెత్తుతాయి. ఇవ్వాల్సిన బియ్యం గురించి ఒత్తిడి చేస్తున్న అధికారులు అసలు ఆ మిల్లుల్లో ధాన్యం, బియ్యం నిల్వలు ఉన్నాయా ? లేదా ? అన్న విషయంపై లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉంది. నిర్దేశించిన కాలపరిమితిలో సీఎంఆర్ ఇవ్వకుండా నిబంధనలు అతిక్రమించే మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ 'సాక్షి'తో మాట్లాడుతూ అన్నారు.

మిల్లర్ల మాయాజాలం..

రెగ్యులర్‌గా వ్యాపారం చేసే మిల్లుల యాజమాన్యాలు కస్టం మిల్లింగ్ రైస్ ఇచ్చే విషయంలో కొంత బాధ్యతగా ఉంటాయి. కొంత వెనకాముందైనా ఇచ్చేసి, ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటారు. అయితే మిల్లులను లీజుకు తీసుకున్న వారిలో కొందరు బియ్యం ఇవ్వకుండా నెలలు, ఏళ్ల తరబడిగా నాన్చుతూ రావడం పరిపాటిగా మారింది. సీఎంఆర్ ఇవ్వలేదని ఒక వేళ మిల్లులను బ్లాక్‌లిస్టులో పెడితే యాజమాన్యానికి ఇబ్బంది ఎదురవుతుంది తప్ప తమకు కాదన్న ధీమాతో కొందరు లీజుదారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 163 మిల్లులు ఉండగా, అందులో 93 మిల్లుల నుంచి సీఎంఆర్ రావాల్సి ఉంది. 23 మిల్లుల్లోనైతే ధాన్యం తీసుకోవడమే తప్ప తిరిగి ఇచ్చింది లేదని తెలుస్తోంది.

రేపటిలోగా సర్వే పూర్తి చేయాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



టెలీ కాన్ఫరెన్స్‌లో మట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: ప్రజాపాలన సమయంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో వంట గ్యాస్ కనెక్షన్లకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న వివరాలను వెంటనే సేకరించి నిర్దేశించిన యాప్‌లో పొందుపరచాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సర్వే బృందాలను ఆదేశించారు. గురువారం జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభయహస్తం కింద ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందించే పథకాన్ని త్వరలో అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. అందుకోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించగా వివరాలు సక్రమంగా లేవన్నారు. దీంతో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశించిందని పేర్కొన్నారు. ప్రధానంగా దరఖాస్తుల్లో గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్జ్యూమర్ నంబర్, రేషన్ కార్డు నంబర్ వంటి వివరాలను ప్రజలు సరిగా పొందుపర్చలేదన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పిదాలను సరిచేయడానికి ప్రత్యేక యాప్‌ను రూపొందించిందని తెలిపారు. తప్పిదాలను సరిచేయడానికి ఏర్పాటు చేసిన గ్రామ, మున్సిపల్ వార్డు స్థాయి బృందాలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి వివరాలను సేకరించాలన్నారు. అనంతరం ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలో అధికారులకు వివరించారు. సర్వే బందాలు శనివారంలోగా తప్పిదాలు నమోదు చేసిన దరఖాస్తుదారులను సంప్రదించి సమగ్ర వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేసేలా పర్యవేక్షించాలని ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లకు సూచించారు. సక్రమంగా ఉన్న దరఖాస్తులు ఆమోదం కోసం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, సర్వే బందాలు తమను సంప్రదించలేదని సదరు దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ వెల్లడించారు.

వైద్యశాఖలో ఉద్యోగుల డిప్యుటేషన్లు రద్దు

- వైద్య ఆరోగ్యశాఖలో 99 మంది, టీవీవీపీలో 15 మందికి..
- మధ్యాహ్నం జిల్లా కార్యాలయాల్లో రిపోర్ట్
- సాయంత్రం సొంత స్థానాల్లో విధుల్లో చేరిక

కామారెడ్డి టౌన్: జిల్లాలోని వైద్యశాఖలో ఉద్యోగుల డిప్యుటేషన్లు రద్దయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ ఉత్తర్వుల మేరకు అధికారులు గురువారం ఆగమేఘాలపై ఉద్యోగుల డిప్యుటేషన్లను రద్దుచేసి వెంటనే సొంత స్థానాలకు వెళ్లి విధుల్లో చేరాలని ఉత్తర్వులను అందజేశారు. ఒకే రోజులో ప్రక్రియ పూర్తవడం గమనార్హం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో డిప్యుటేషన్, వర్క్ ఆర్డర్, ఆన్‌డ్యూటీ విధులు చేస్తున్న ఉద్యోగుల్లో రెగ్యులర్ ఎంప్లాయీస్ 67 మంది, ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ 24 మంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 8 మంది ఉద్యోగుల డిప్యుటేషన్ రద్దు చేశారు. అలాగే తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో ఐదుగురు వైద్యులు, ఐదుగురు స్టాఫ్ నర్సులు, ఐదుగురు పారా మెడికల్ సిబ్బంది డిప్యుటేషన్లను సైతం రద్దు చేశారు. దీంతో ఉద్యోగులు డీఎంహెచ్‌వో, జిల్లా కేంద్ర ఆస్పత్రి కార్యాలయాల్లో మధ్యాహ్నం రిపోర్టు అందజేసి సాయంత్రం తిరిగి తమ సొంత స్థానాల్లో విధుల్లో చేరారు. డిప్యుటేషన్ల రద్దుతో పలు ఆస్పత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

జ్ఞానాన్ని పొందడమే అసలైన విద్య



మాట్లాడుతున్న కర్నాటక సెంట్రల్ యూనివర్సిటీ వీసీ సత్యనారాయణ

- వర్సిటీలు విద్యతో పాటు సమాజ సమస్యలకు పరిష్కారం చూపాలి
- కర్నాటక సెంట్రల్ యూనివర్సిటీ వీసీ సత్యనారాయణ

భిక్కనూరు: అసలైన విద్య అంటే డిగ్రీలు సాధించడం కాదని.. జ్ఞానాన్ని పొందడమేనని కర్నాటక సెంట్రల్ యూనివర్సిటీ వీసీ సత్యనారాయణ అన్నారు. విశ్వవిద్యాలయాలు విద్యతో పాటు సమాజంలో ఉన్న సమస్యలను పరిష్కారాలు చూపే విధంగా ఉండాలని పేర్కొన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో 'ఉన్నత విద్య – ఉపాధి అవకాశాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే రెండేళ్లు బంగారుమయంగా ఉంటుందన్నారు. వారి బంగారు భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఆశావాదం ఉండాలని.. లక్ష్యాన్ని ఏర్పరుచుకుని సాధించేందుకు కృషిచేయాలని సూచించారు. తలిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ప్రైవేటు రంగంలో కూడా ఉద్యోగాలు సాధించేందుకు కృషిచేయాలన్నారు. ఉద్యోగాలు చేసే స్థాయినుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన నలంద, తక్షశిల వంటి అనేక విశ్వవిద్యాలయాలు ప్రపంచానికి ఎన్నో విషయాలను నేర్పించాయని పేర్కొన్నారు. దేశ చరిత్ర, సంస్కృతి ఎంతో గొప్పవన్నారు. యూజీసీ యూనివర్సిటీల విద్యార్థుల కోసం అనేక కొత్త విధానాలను తెచ్చిందని అందులో ఎంవోసీఎస్ స్వయం అనేది ఒక ఉదాహరణ అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా బహుళ క్రమశిక్షణ కోర్సుల రూపకల్పన జరుగుతుందన్నారు. 2047 వరకు దేశం వికసిత్ భారత్‌గా మారాలన్నారు. కరోనా కాలంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత భారతీయ శాస్త్రవేత్తలదేనని పేర్కొన్నారు. సదస్సులో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, కామర్స్ డీన్ రాంబాబు, ప్రొఫెసర్లు యాదగిరి, లలిత, హరిత, మోహన్‌బాబు, అంజయ్య, వీరభద్రం, ప్రతిజ్ఞ, కవిత, యాలాద్రి, సునీత, నారాయణ పూర్వ విద్యార్థి వంగ రాహుల్ నేత పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు విముఖత

- ఎల్‌ఆర్‌ఎస్‌కు ముందుకు రాని పట్టణ వాసులు
- గతంలో రూ. వెయ్యి చెల్లించిన వారికే అవకాశం
- డాక్యుమెంట్ విలువలో 14శాతం ఫీజు చెల్లిస్తేనే క్రమబద్ధీకరణ



బాన్సువాడలోని ఓ వెంచర్‌లో గల ప్లాట్లు

బాన్సువాడ: పట్టణాల్లో అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు క్రమబద్ధీకరణకు విముఖత చూపుతున్నారు. గతంలో ఆన్‌లైన్‌లో రూ. వెయ్యి చెల్లించిన వారు ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎప్పుడైతే ప్లాట్లు కొనుగోలు చేశారో అప్పటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌పై ఉన్న విలువలో 14శాతం ఫీజును మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉంటుంది. అప్పట్లో వేలమంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇప్పుడు ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ముందుకు రావడంలేదు. ప్లాట్ల యజమానులు స్వచ్ఛందంగా ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవడానికి ముందుకు రావాల్సిందే తప్ప వారిని బలవంతం చేసే అవకాశం లేదు. ఒకవేళ ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటే ప్లాట్ల యజమానులకు ఇబ్బందులు వచ్చే అవకాశాలు లేకపోలేదు.

భారీగా దరఖాస్తులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీల పరిధిలో సుమారు 20వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కేవలం సుమారు రెండు వేల వరకు మాత్రమే క్రమబద్ధీకరణ చేయించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టే ఆలోచనలో ఉన్న వారు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఎల్‌ఆర్‌ఎస్ ఉంటేనే బ్యాంకు రుణం

ఇల్లు, వాణిజ్య భవనం నిర్మాణాలు చేపట్టేందుకు బ్యాంకు రుణం తీసుకోవడానికి ఎల్‌ఆర్‌ఎస్ తప్పనిసరి. ఎల్‌ఆర్‌ఎస్ లేనిదే ఏ బ్యాంకు కూడా రుణం ఇవ్వదు. చాలా ప్రాంతాల్లో పది, పదిహేనేళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించి ఎక్కువగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ ద్వారా ఆయా మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరనుంది.

మున్సిపాలిటీల వారీగా వచ్చిన దరఖాస్తులు

కామారెడ్డి	18000
బాన్సువాడ	1690
ఎల్లారెడ్డి	920

ఎల్‌ఆర్‌ఎస్ చేసుకుంటేనే నిర్మాణ అనుమతి

మున్సిపాలిటీల్లో అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు వాటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ చేసుకుంటేనే భవన నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి అనుమతి లభిస్తుంది. ఎల్‌ఆర్‌ఎస్ లేని ప్లాట్లలో భవనాలు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వరు. పట్టణాల్లో వేల సంఖ్యలో ఎల్‌ఆర్‌ఎస్ లేని ప్లాట్లు ఉండడంతో గత ప్రభుత్వం క్రమబద్ధీకరణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. రూ. వెయ్యి చెల్లించి ఆన్‌లైన్‌లో చాలామంది దరఖాస్తులు చేసుకున్నారు. అప్పుడు దరఖాస్తు చేసుకున్న వారు 14శాతం ఫీజు చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేయనున్నారు. అప్పట్లో వెయ్యి రూపాయలు చెల్లించకుండా దరఖాస్తు చేసుకోని వారికి క్రమబద్ధీకరణ చేయరు.

హైకోర్టునే తప్పుదోవ పట్టించారు

- తెలంగాణ వర్సిటీ గత వీసీ, ఇద్దరు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ల వ్యవహారం
- యూజీసీ నిబంధనల ఉల్లంఘన
- అడ్డదారిలో పదోన్నతి పొందిన కనకయ్య
- ఈ విషయమై అప్పీలు చేసిన ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి
- అక్రమ వ్యవహారాలను గతంలోనే వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అనేక అవినీతి అక్రమాలకు, వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచిన నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇప్పటికీ గందరగోళం సద్దుమణగలేదు. రెండున్నరేళ్ల కిందట వర్సిటీలో అక్రమాలకు, వివాదాలకు ఆద్యుడిగా పేరుపొందిన ప్రొఫెసర్ కనకయ్య తాజాగా అడ్డదారిలో పదోన్నతి పొందేందుకు ఏకంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్నే తప్పుదోవ పట్టించడం గమనార్హం. దీంతో ఈ వ్యవహారంపై ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి హైకోర్టులో అప్పీలు చేయడం విశేషం.

వివరాల్లోకి వెళితే.. 2021 సెప్టెంబర్‌లో కనకయ్య వివాదాస్పద రీతిలో యూజీసీ/రాష్ట్ర ప్రభుత్వ నియామక నిబంధనలను ఉల్లంఘించి, నోటిఫికేషన్ లేని సీనియర్ ప్రొఫెసర్ పదవికి ఆయనకు ఆయనే పదోన్నతి కల్పించుకున్నారు. అప్పట్లో ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో 2021 అక్టోబర్ 30న వర్సిటీలో నిర్వహించిన పాలక మండలి సమావేశంలో అక్రమంగా పొందిన పదోన్నతితో పాటు మరికొన్ని వివాదాస్పద నిర్ణయాలను రద్దు చేసి, కనకయ్యకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తీర్మానించారు. అదేవిధంగా కొందరు ప్రొఫెసర్ల సర్వీస్ పుస్తకాలను కనకయ్య అక్రమంగా ఇంటికి తీసుకెళ్లడంపై పోలీసు కేసు పెట్టాలని నిర్ణయించారు. అయితే సదరు అక్రమ ప్రమోషన్ విషయాన్ని అప్పటి వీసీ రవీందర్‌గుప్తాతో కలిసి గోప్యంగా ఉంచి, తన ప్రమోషన్ విషయంపై యూనివర్సిటీ స్పందించడంలేదంటూ కనకయ్య హైకోర్టుకు వెళ్లాడు. అసలు విషయాన్ని కప్పిపుచ్చి న్యాయంగా తనకు పదోన్నతి రావాలని హైకోర్టుకు చెప్పడం విశేషం. ఈ క్రమంలో కోర్టు ఆదేశాలపై అప్పటి రిజిస్ట్రార్ కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించారంటూ కోర్టు ధిక్కారం కేసు సైతం 394/22 నంబరులో నమోదైంది. ఈ మేరకు 2022 ఏప్రిల్ 18న మొదటిసారి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అదే ఏడాది జూలైలో అప్పటి రిజిస్ట్రార్ శివశంకర్ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న విద్యావర్ధిని వేతన సవరణ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు హైకోర్టుకు చెప్పడం విశేషం.

యూజీసీ నిబంధనలు బేఖాతరు



నోటిఫికేషన్‌లో లేని పోస్టుకు తనకు తానుగా ఇచ్చుకున్న ప్రమోషన్, జీతానికి సంబంధించి పాలకమండలి ఆమోదం లేదు. అదేవిధంగా వరుసగా నియామకమైన ఇద్దరు రిజిస్ట్రార్ల నియామకం సైతం చెల్లదని పాలకమండలి తీర్మానించింది. వాళ్ల హయాంలో జరిగిన అన్ని నిర్ణయాలను రద్దు చేస్తున్నట్లు ఈసీ సభ్యులు తీర్మానంలో పేర్కొన్నారు. అయినప్పటికీ అప్పటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని కోర్టుకు వెళ్లి పాలకమండలి అధికారికంగా తీసుకున్న నిర్ణయాలను దాచిపెట్టి ఆమె సైతం కోర్టును తప్పుదోవ పట్టించడం గమనార్హం. విద్యావర్ధిని ఇచ్చిన వివరణ ప్రకారం వేతన సవరణ చేయాలని, లేనిపక్షంలో కోర్టు ధిక్కారం కింద చర్యలు తీసుకుంటామని మరోసారి 2023 ఏప్రిల్ 9న హైకోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ విషయంలోనూ వర్సిటీ స్పందించకపోవడంతో 2024 జనవరి 8న తుది ఉత్తర్వులు కోర్టు జారీ చేసింది. దీంతో స్పందించిన ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి అప్పటి వీసీ రవీందర్‌గుప్తా, కనకయ్య, విద్యావర్ధినులు కోర్టును తప్పుదోవ పట్టించినట్లు 2024 జనవరి 31న హైకోర్టులో అప్పీలు చేశారు.

'గృహజ్యోతి' కోసం వివరాలివ్వాలి

ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబు

కామారెడ్డి టౌన్: ప్రజాపాలనలో కార్యక్రమంలో సమర్పించిన గృహజ్యోతి పథకం దరఖాస్తుల సమాచార ధ్రువీకరణ కోసం విద్యుత్‌శాఖ సిబ్బంది జిల్లాలో ఇంటింటా సర్వే చేస్తున్నారని ఇందుకు కావాల్సిన వివరాలను దరఖాస్తుదారులు అందించాలని విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ అధికారి రమేశ్‌బాబు గురువారం తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తు రశీదు, ఆహార భద్రత కార్డు, ఆధార్ కార్డు నంబర్ల వివరాలను అందుబాటులో ఉంచుకుని సిబ్బందికి ఇవ్వాలని వినియోగదారులకు సూచించారు. సిబ్బంది వచ్చే సమయంలో ఇంటి వద్ద అందుబాటులో లేకపోతే ఆ వివరాలను నేరుగా విద్యుత్ సహాయ ఇంజినీర్, సహాయ గణాంక అధికారి కార్యాలయంలో అందజేయవచ్చని సూచించారు. సర్వే చేస్తున్న సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఈసీ నామినీగా ప్రొఫెసర్ సిద్ధిఖీ

- తెయూ పాలకమండలి సమావేశంలో నిర్ణయం
- పలు తీర్మానాలకు ఆమోదం



తెయూ(డిచ్‌పల్లి): యూనివర్సిటీలను గాడిలో పెట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా అన్ని యూనివర్సిటీలకు కొత్త వీసీ (వైస్ ఛాన్సలర్)లను నియమించేందుకు జనవరి 27న నోటిఫికేషన్ జారీ చేసింది. అదే నెల 28 నుంచి ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరణ కొనసాగుతున్నది. సెర్చ్ కమిటీ వీసీల పేర్లను ప్రతిపాదించనున్న నేపథ్యంలో.. ప్రభుత్వం ముగ్గురితో సెర్చ్ కమిటీని నియమిస్తుంది. వీరిలో యూజీసీ నామినీ, రాష్ట్ర ప్రభుత్వ నామినీ, వర్సిటీ నామిని (ఈసీ నామినీ) ఉంటారు. తమకు అందిన దరఖాస్తులను సెర్చ్ కమిటీ పరిశీలించి ముగ్గురు అర్హుల పేర్లను ప్రభుత్వానికి పంపిస్తుంది. ముఖ్యమంత్రి ఆమోదంతో గవర్నర్‌కు పంపిస్తే.. అందులో ఒకరిని వీసీగా నియమిస్తారు. దరఖాస్తులకు గడువు దగ్గరపడటంతో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, వీసీలు, పాలకమండళ్ల (ఈసీ)తో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

తెలంగాణ యూనివర్సిటీ 63వ పాలకమండలి సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రస్తుతం తెయూ ఇన్‌చార్జి వీసీగా వ్యవహరిస్తున్నారు. సమావేశంలో అజెండా అంశాలపై చర్చించి పలు తీర్మాణాలు చేశారు. ముఖ్యంగా తెయూ నామినీగా ప్రొఫెసర్ సులేమాన్ సిద్ధిఖీ పేరును ప్రతిపాదించి ఆమోదించారు. ఆయన తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో వర్సిటీ ఓఎస్డీగా విధులు నిర్వర్తించారు. సమావేశంలో రిజిస్ట్రార్ యాదగిరి, పాలకమండలి సభ్యులు నసీం, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, ర వీందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, వసుంధరాదేవి, మారయ్యగౌడ్, ఎస్ఎల్ శాస్త్రి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

తీర్మానాలివీ..

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి పదవీ కాలాన్ని ఏడాదిపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పొడిగింపు.
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెయూ పరిధిలో మొదటి సారి డిగ్రీ, పీజీ విద్యార్థులకు డిటెన్షన్ విధానం అమలు.
- పరీక్షల విభాగం (ఈడీపీ)లో అమలు చేస్తున్న ఆన్‌లైన్ వాల్యుయేషన్ ఏజెన్సీకి వచ్చేసారి రెన్యువల్ చేయకుండా టెండర్లు పిలవడం.
- మెయిన్ క్యాంపస్‌లో సైన్స్‌బ్లాక్ నిర్మాణం కోసం మొదట రూ.12 కోట్ల నిధులతో ప్రతిపాదనలు ఉండగా, భవన నిర్మాణం పూర్తి చేయడానికి అదనంగా మరో రూ.6 కోట్లు వర్సిటీ అంతర్గత నిధులనుంచి మంజూరు.
- క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్‌ను నియమించడంతోపాటు నెలకు రూ.40వేలు వేతనం చెల్లింపు.
- వర్సిటీలో కంప్యూటర్స్‌ను టీఎస్‌టీఎస్ ద్వారా, ఇతర సామగ్రిని ప్రభుత్వ జైళ్ల శాఖ ద్వారా మాత్రమే కొనుగోలు చేయడం.
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ భ్రమరాంభిక పదోన్నతిపై ఆమె పీహెచ్‌డీ పొందిన యూనివర్సిటీకి లేఖ రాయడం.
- పదవీ విరమణ పొందిన అసోసియేట్ ప్రొఫెసర్ జి.ప్రవీణాబాయికి పింఛన్ బెనిఫిట్స్ కోసం ప్రభుత్వానికి లేఖ.
- ప్రొఫెసర్ పి.కనకయ్యకు సీనియర్ ప్రొఫెసర్ పదవి కేటాయింపుపై హైకోర్టు ఇచ్చిన కోర్టు ధిక్కరణ ఉత్తర్వులపై హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళ్లడం.

క్లుప్తంగా

21లోగా ఫీజు చెల్లించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు పరీక్ష ఫీజును ఈనెల 12వ తేదీ నుంచి 21వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ గంగా కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 98663 43898కు సంప్రదించాలని కోరారు.

కళాశాలలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలలో 2024–25కు గాను ప్రవేశాల కోసం గడువు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ తెలిపారు. దరఖాస్తుల గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న వారు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 2లక్షల 69వేల 290 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామన్నారు.

పౌష్టికాహారం అందించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని భిక్కనూర్ ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర సెస్ బృందం కో ఆర్డినేటర్లు మోహన్‌రావు, సుమలత గురువారం పరిశీలించారు. పీఎం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఎండీఎం ద్వారా పౌష్టికాహారం అందించాలని సూచించారు. వారివెంట ఎంఈవో వెంకటేశం, ఉపాధ్యాయుడు ఆంజనేయులు తదితరులున్నారు.

నిజాయితీ చాటుకున్న యువకులు

కామారెడ్డి క్రైం: రోడ్డుపై వెళ్తుండగా దొరికిన పర్సును ముగ్గురు యువకులు. పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు ఈ ఘటన జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. పట్టణానికి చెందిన సంపత్, ప్రవీణ్, వినయ్ ఆర్‌కే డిగ్రీ కాళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. స్నేహితులైన వారు ముగ్గురు కలిసి కళాశాల నుంచి జీవదాన్ ఆస్పత్రి వైపు వస్తుండగా, ఒక పర్సు దొరికింది. వెంటనే వారు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసులు వచ్చి విచారించగా పర్సు పోగొట్టుకున్న వ్యక్తిని ఐలాపూర్ గ్రామానికి చెందిన కార్తీక్‌గా గుర్తించారు. అతడు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. ఆ పర్సులో రూ.23 వేల నగదు ఉంది. పట్టణ ఎస్‌హెచ్‌ఓ కార్తీక్‌ను ఠాణాకు పిలిపించి, అతని పర్సు, డబ్బులను సంపత్ చేతుల మీదుగా ఇప్పించారు. రోడ్డుపై దొరికిన పర్సును వెంటనే పోలీసులకు తెలియజేసి, పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించిన యువకులను ఎస్‌హెచ్‌వో అభినందించి శాలువాతో సన్మానించారు.

10న ఉర్దూ కవి సమ్మేళనం

దోమకొండ: మండలంలోని గడికోటలో ఈ నెల 10న ఉర్దూ కవి సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ గురువారం తెలిపారు. గతంలో సంస్థానాలను పాలించిన సంస్థానదీశుల సేవలపై, వివిధ రాష్ట్రాల ఉర్దూ కవులతో సమ్మేళనం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గడికోట సంస్థాన వారసుడు కామినేని అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళనానికి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ సింధుశర్మ, తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం చైర్మన్ మహమ్మద్ అబ్దుల్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ఉర్దూ కవులు, సాహితీ సేవకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. ఎంపికై న క్రీడాకారులు ఈనెల 11న యదాద్రి జిల్లా భువనగిరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా చైర్మన్ బిల్ల అనిల్, అధ్యక్షుడు భూమారెడ్డి, కార్యదర్శి మహ్మద్ అతికుల్లా తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రాజు, పరీక్షల కమిషనర్ నీలం లింగం, ప్రతినిధులు ఎస్.మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వరరావు, అస్మా, సంజీవులు, ప్రభావతి తదతరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి సహకరించాలి

నిజామాబాద్‌నాగారం: గృహజ్యోతి పథకం కోసం ప్రతి ఇంటికి వచ్చే విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు వివరాలు అందించి సహకరించాలని ఎస్ఈ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజాపాలన దరఖాస్తు రసీదు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్, ఆధార్‌కార్డు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తమ సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చినప్పుడు ఈ వివరాలు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ సిబ్బంది వచ్చినప్పుడు వినియోగదారులు అందుబాటులో లేకుంటే దగ్గరలోని విద్యుత్ కార్యాలయాల్లో వివరాలు అందించాలని కోరారు.

గ్యాస్ కనెక్షన్ వివరాలు త్వరగా నమోదు చేయాలి

రుద్రూర్: ప్రజాపాలన దరఖాస్తులలో సరిగా లేని గ్యాస్ ఏజెన్సీ, కనెక్షన్ నంబర్ సరి చేసి సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ ఆదేశించారు. రుద్రూర్ మండల పరిషత్ కార్యాలయంలో గ్యాస్ వివరాల నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. గ్యాస్ వివరాలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యదర్శుల సందేహాలను నివృత్తి చేశారు. ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో సాయిలు, కార్యదర్శులున్నారు.



యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో చందర్ నాయక్

ఆధార్, రేషన్‌కార్డులను అనుసంధానం చేయాలి

నందిపేట్(ఆర్మూర్): గృహజ్యోతి పథకానికి అర్హులైన విద్యుత్ వినియోగదారుల సర్వే నంబర్‌తో ఆధార్, రేషన్ కార్డు వివరాలతో పాటు ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేయాలని నిజామాబాద్ ట్రాన్స్ డివిజనల్ ఇంజినీర్ ఎం.శ్రీనివాస్ ఆదేశించారు. నందిపేట 133/11 కేవీ సబ్‌డివిజన్ పరిధిలోని నందిపేట, నూత్‌పల్లి, మాక్లూర్, గొట్టుముక్కల సెక్షన్ గ్రామాలలో మీటరు రీడింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్తు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఏడీఈ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

మాచారెడ్డి: కుటుంబంలో జరుగుతున్న కుటుంబ కలహాలకు ఓ వివాహిత మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సోమారంపేటలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన మెరుగు స్వప్న(32) మాచారెడ్డి మండలం సోమారంపేటకు చెందిన సతీశ్ వివాహమైంది. సతీశ్ బతుకు దెరువు కోసం మస్కట్ కు వెళ్లాడు. తరచూ ఇంట్లో స్వప్నతో తోటి కోడళ్లు, బావలతో గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపానికి గురైన స్వప్న క్రిమసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాఠశాల ఫర్నిచర్ ధ్వంసం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలపై విద్యార్థి సంఘాల నాయకులు గురువారం దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. స్కూల్‌లో 8, 9, 10వ తరగతులకు అనుమతులు లేవని ఎంఈవో గదులను సీజ్ చేసినా మరుసటి రోజునే సీజ్‌ను తొలగించి స్కూల్‌ను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే స్కూల్ యాజమాన్యంపై చీటింగ్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, బీడీఎస్ఎఫ్, బీవీఎం, పీడీఎస్‌యూ సంఘాల నాయకులు సందీప్, అరుణ్, ఆజాద్, విఠల్, పెరుమాండ్ల బుల్లెట్, సురేశ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కాలువలో పడి ఒకరి మృతి

మోర్తాడ్: ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన చేపూరి నారాయణ(66) కాకతీయ కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. కాలువలో బట్టలు ఉతికేందుకు వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారిపడి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య

రామారెడ్డి: స్కూల్‌కు వెళ్లమని తల్లిదండ్రులు మందలించినందుకు ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన గోసంగి భారతి(15) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఉదయం తల్లితండ్రులు కూలీ పనులు వెళ్లేటప్పుడు స్కూలుకు వెళ్లాలని మందలించారు. దీంతో విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం తల్లితండ్రులు ఇంటికి వచ్చేసరికి కూతురు విగతజీవిగా కనిపించడంతో వారి రోదనలు మిన్నంటాయి. భారతి తండ్రి సాంబ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: పట్టణ కేంద్రంలోని ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. కూలీ పని చేసుకుంటూ జీవించే సదరు వివాహిత ఈ నెల 3న రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



రెంజల్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పేపర్‌మిల్ నుంచి తాడ్‌బిలోలి మీదుగా నిర్మల్ జిల్లాకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాలను స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసి జిల్లా జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక, మొరం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఫకీరాబాద్‌లో మరో టిప్పర్..



నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ శివారులో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. రెంజల్ మడలంలోని సాటాపూర్ నుంచి ఫకీరాబాద్ మీదుగా కొన్ని రోజులుగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం టిప్పర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



అసెంబ్లీకి..

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆర్ భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, వేముల ప్రశాంత్‌రెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, వెంకటరమణారెడ్డితోపాటు ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు.



క్రీడాకారులను ప్రోత్సహించాలి



విజేతలతో ఒలింపిక్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నగరంలోని రాజారాం స్టేడియంలో గురువారం బహుమతులను ప్రదానం చేశారు. జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సాధించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య మాట్లాడుతూ.. ఆక్స్‌ఫర్డ్ స్కూల్ చిన్న విద్యా సంస్థ అయినప్పటికీ.. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించడం అభినందనీయమన్నారు. మిగతా ప్రైవేట్ పాఠశాలలు ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని, క్రీడాకారులనుప్రోత్సహించాలన్నారు. అనంతరం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొబ్బిలి నర్సయ్యను ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వైఆర్ డేవిడ్, అథ్లెటిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మార్టిన్, కపిల్, ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు, 200 మందికి పైగా అథ్లెట్లు పాల్గొన్నారు.

ఫేక్ డాక్యుమెంట్‌తో కండక్టర్ ఉద్యోగం

- రిటైకర్డ్ అయిన ఉద్యోగి
- దర్యాప్తు చేపట్టిన ఆర్టీసీ అధికారులు

ఖలీల్‌వాడి: ఫేక్ డాక్యుమెంట్‌తో ఓ వ్యక్తి ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగం పొంది, రిటైర్డ్ అయ్యారు. ఈ ఘటన జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగర శివారులోని బోర్గాం(పి)కి చెందిన చంద్రశేఖర్ 1986లో కండక్టర్ ఉద్యోగాన్ని సెలక్షన్ కమిటీ ద్వారా పొందాడు. 32 ఏళ్ల ఆర్టీసీలో ఉద్యోగం చేశారు. నగరంలోని ఒకటో డిపోలో కండక్టర్‌గా పని చేసి, అంచెలంచెలుగా పదోన్నతి పొంది రిటైర్‌మెంట్ పొందారు. చంద్రశేఖర్ నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఉద్యోగం సాధించాడని ఇటీవల కలెక్టర్‌కి ఫిర్యాదు అందింది. దీంతో కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రిటైర్‌మెంట్ సమయంలో సైతం నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు తేలింది. దీంతో ఆర్టీసీ డిపో–1 డీఎం ఆనంద్ బుధవారం ఒకటో టౌన్‌లో చంద్రశేఖర్‌పై ఫిర్యాదు చేశారు. ఐపీసీ 406, 420, 468, 471 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ప్రత్యేక బృందాలతో చంద్రశేఖర్ కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై డిపో మేనేజర్ ఆనంద్‌ను వివరణ 2017లో చంద్రశేఖర్‌పై ఫిర్యాదు వచ్చిందని అప్పుడు కోర్టు నుంచి స్టే తీసుకున్నట్లు తెలిపారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఉద్యోగం పొందడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

అన్నను కాపాడబోయి తమ్ముడి గల్లంతు

- కాలువలో ముమ్మర గాలింపు
- ఒడ్డుకు చేరుకున్న అన్న

మోర్తాడ్: కాలువలో పడ్డ అన్నను కాపాడబోయి తమ్ముడు గల్లంలైన ఘటన కాకతీయ కాలువలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన లక్ష్మీనారాయణ తన ఇద్దరు కుమారులు గౌతం, గణేశ్‌తో కలిసి ఏర్గట్ల శివారులోని కాకతీయ కాలువ సమీపంలో ఈతకల్లు సేవించడానికి గురువారం వెళ్లా రు. కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో గౌతం కాలువలోకి దిగాడు.

దీంతో అన్నని రక్షించేందుకు తమ్ముడు గణేశ్ కాలువలోకి దిగి రక్షించేందుందుకు ప్రయత్నించాడు. గౌతం ఎలాగో లా ఒడ్డుకు చేరుకున్నాడు. గణేశ్ మా త్రం రెప్పపాటులో కాలువ ప్రవాహ వేగానికి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు కాలువలో గా లింపు చర్యలు చేపడుతున్నారు. గణేశ్ గల్లంతు కావడంపై కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

అర్గుల్‌లో విద్యార్థి కిడ్నాప్‌కు యత్నం

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో విద్యార్థి కిడ్నాప్‌యత్నం కలకలం రేపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగరాజు అనే ఎనిమిదో తరగతి విద్యార్థి ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఓమ్ని వాహనాన్ని ఆపి ఆడవేషంలో ఉన్న ఇద్దరు చాక్లెట్లు ఇస్తామని నాగరాజును పిలిచారు. దీంతో విద్యార్థి భయపడి వెంటనే పాఠశాలకు వెళ్లి జరిగిన విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపాడు. నాగరాజును కిడ్నాప్ చేయడానికి దుండగులు వచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై తిరుపతిని వివరణ కోర గా.. నాగరాజును ఎవరైనా వివరాలు అడిగి ఉంటారేమోనని అనుమానిస్తున్నట్లు తెలిపాడు. మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి సీసీపుటేజ్‌లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

మిట్టాపల్లిలో అనుమానితుల పట్టివేత

డిచ్‌పల్లి: ఊరూరు తిరుగుతూ భిక్షాటన చేసే యాచకులను పిల్లలను ఎత్తుకెళ్లే వారిగా అనుమానించిన గ్రామస్తులు వారిని బంధించి పోలీసులకు పట్టించిన ఘటన మండలంలోని మిట్టాపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన షేక్ హమీద్ తన కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు, ఇద్దరు పిల్లలతో కలిసి గురువారం మిట్టాపల్లికి వచ్చాడు. హమీద్ గ్యాస్ స్టవ్‌లు రిపేర్ చేస్తుంటాడు. మహిళలు పిల్లలతో కలిసి భిక్షాటన చేస్తుంటారు. ఇటీవల జిల్లాలో వరుసగా పిల్లల కిడ్నాప్ ఉదంతాలు చోటు చేసుకున్న నేపథ్యంలో గ్రామంలో అపరిచితులు కనిపించడంతో పిల్లలను ఎత్తుకెళ్లే వారిగా అనుమానించిన గ్రామస్తులు వారిని బంధించి పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకున్న ఎస్సై వారిని పీఎస్‌కు తరలించి విచారణ చేపట్టారు. తాము కామారెడ్డికి చెందిన వారిమని, భిక్షాటన చేసుకుంటూ బతుకుతామని చెప్పడంతో తహసీల్దార్ రాజేందర్ ఎదుట బైండోవర్ చేసి సొంత పూచీకత్తుపై పంపించినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

మాక్లూర్: మండలంలోని గుత్ప శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు గురువారం తెలిపారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 18వేల నగదు, 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సదాశివనగర్: మండలంలోని మోడెగాం గ్రామానికి చెందిన ఒకరికి డ్రంకన్ డ్రైవ్‌లో రెండో తరగతి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. డ్రంకన్ డ్రైవ్ తనిఖీలో మద్యం తాగి వాహనం నడిపినందున జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.